# గో - బేక్

రేడియోలో ఇంగ్లీషు వార్తలు ప్రారంభమయ్యాయి.

గోడగడియారం ఎనిమిది గంటలు కొట్టింది.

నాలుగు దిక్కులా సైరన్లు మ్రోగాయి. సోహన్ సింగ్ అలంకార్ హోటలు మేడమీద నుంచి క్రిందకు చూశాడు.

ఎటుచూసినా నేల యీనినట్టు జనం, చీమ చిట్టుక్కుమన్నంత నిశ్శబ్దం. స్టెన్‌గన్, టియర్‌గాస్ షెల్స్, ఆటోమేటిక్ రైఫిల్సు, మెషిన్ గన్స్ నిద్ర మేల్కొన్నాయి.

విశ్రాంతి పొందిన మనస్సుకి ఒక్కసారిగా టెన్షన్.

నిశ్శబ్దం... నిశ్శబ్దం.

రేడియోలో స్టేషన్ మారింది.

ఎక్కడో... ఎక్కడో... దూరంగా

హిమాలయ పర్వతాల వాలులో, కొండ చరియల నీడలోన, కోనల నడుమలో... మరపున దాగిన మధుర స్మృతి చిహ్నం సంగీత లహరిగా- వలపుల వెలువగా కదలివచ్చింది మనసులోని పాటగా

"సావన్... బీతా జాయ్!

బలమా...తూ నహి ఆయ్!!"

మనసు కనకదుర్గ కొండమీద నిలచింది.

సముద్రంలో తుఫాను వచ్చింది.

కలవరం హెచ్చింది.

అంతలో లారీ వచ్చి ఆగింది.

వందలాది సోడాబుడ్లు 'మై గాడ్!'

వాటర్ బాంబ్స్!

వైర్‌లెస్ రిసీవరు మ్రోగింది. అలవాటుగా సోహన్‌సింగు గడియారం వంక చూసుకున్నాడు.

సమయం ఉదయం ఎనిమిది గంటల ఇరవై నిముషాలు. తారీఖు ముప్పై ఒకటి. అమ్మయ్య ఈ రోజు ఆఖరి రోజు. రేపటినుంచి యీ నెత్తురు కూడు

తిననక్కర్లేదు. వైర్‌లెస్ పలికింది. 'డబుల్ త్రీ సిక్స్, డబుల్ త్రీ సిక్స్, డబుల్ త్రీ సిక్స్ హియర్ - మూవ్ ఫార్వర్డ్- ఓవర్'

వైర్‌లెస్ ఆగిపోయింది. లారీలు కదిలాయి. ఒకటి రెండు మూడు నాలుగు రోడ్డుకు అడ్డంగా ఆగివున్నాయి. ముఖానికి మాస్క్లు, చేతిలో లాఠీలు, కొందరి దగ్గర బైనెట్లు వున్న రైఫిల్సు.

కొందరి దగ్గర టయిం తప్పు. అంతలోనే కల్లోలం జనం సిమెంటు రోడ్డు తవ్వి వేస్తున్నారు. రోడ్డు ప్రక్కన రాళ్ళగుట్టల వైర్‌లెస్ మళ్ళీ మ్రోగింది- 'సోహన్ సింగ్.'

"యస్ సర్"

"ఎవరి స్థానాలలో వాళ్ళు వుండండి. ప్రజలు రెచ్చగొట్టినా మీరు మాత్రం మీ మీ స్థానాల నుంచి కదలకండి. ఎనిమిది ఇరవై అయిదు. వివిధ భారత్ మళ్ళీ అదే పాట- బేగం అక్తర్ కంఠం "సావన్ బీతా జాయ్ బలమా తూ నహీం ఆయే". 1948 లో అదే గొంతు అదే పాట- కాని ఆ రూపం వేరు, పేరు కూడా 'చమేలి'.

ఇంటికి కొత్తగా వచ్చిన కోడలు తను ఇంటలేదనుకుని 'ఎవరూ వినడం లేదనుకుని, ఆ ముద్దరాలి మనసులోని మాట తన ఒక్కడి చెవిని పడ్డది. అంతలోనే సిగ్గు దొంతరలు, అంతలోనే ఆనందం- చేరువ అవుదామనే కోరికతో దూరంగా దూరంగా పారిపోయిన చిన్నది,

తామిద్దరికి వినపడే లాగ వెన్నెలలో పలికిన రాగం "ఎదుట వుండగానే ఎందుకీ విరహగీతం?" మనసిచ్చిన మగువ మారు పలుకలేదు. కన్నీరు కదలివచ్చింది. ఎందుకు? ఎందుకని యీ విషాదం అని ఎన్నోసార్లు అడిగాడు. సమాధానం మౌనమే! మరునాడు యీ తీయని కల కరిగింది. కాశ్మీరు నుండి కబురు వచ్చింది. క్షణకాలం వ్యవధిలేదు. కనుసన్నలలోనే వీడ్కోలు.

రథచక్రాలు కదిలాయి.

"మోర్టార్స్ - హోవైజర్స్" హాలిఫాక్సు విమానాలు, బి2 బాంబర్లు, చతురంగ బలాలవెంట తాము కూడా తరలిపోయారు.

యుద్ధం ఎక్కడ జరిగిందో, ఎవరికి జరిగిందో, ఎందుకు జరిగిందో ఎవరికీ తెలియదు.

అపకారం పొందిన శత్రువు అణిగి వుంటే, ఉపకారం పొందిన ఈ మిత్రులకి ఇంత ద్వేషం ఎందుకో?

అనుక్షణం ఫిరంగుల మ్రోతలో విమానాల రొదలో బాంబుల ప్రళయ తాండవంలో తుఫానులోని హోరుకన్న బిగ్గరగా వినిపించిన శబ్దం.

"హిందూ కుత్తా లౌట్‌జావ్!", "హిందూ సాలే లౌట్ జావ్" ప్రాణాలొడ్డి నందుకు ప్రతిఫలం- మంచితనానికి ఫలితం వంచన?

ఈ మనుష్యులకు మిగిలింది వేదన! ఆవేదన! ఈ నిరంతర వేదనలో అనుక్షణం ఎదురుచూసే మృత్యువు ఛాయలో నిలకడలేని మనస్సు నీడలో నిశ్శబ్దంగా వినిపించే సరాగ రాగం...

"సావన్ బీతా జాయి
బలమా తూ నహి ఆయి"

వెయ్యి అగ్ని పర్వతాలు ఒక్కసారిగా పేలాయి. వెయ్యి నాలుకల్లో విరహ జ్వాలలు దహింప జూచేవి.

యంత్రాలలో యంత్రంగా
మారణ యుద్ధాలలో మారణాయుధంగా

ప్రశ్నించడానికి వీలులేని ఆజ్ఞలకు తలవొగ్గి దానవుడిలాగా జీవించడమే తాము చేసిన మహత్కార్యం.

విశ్వాస పాత్రుడినవడంవల్ల పదవి పెరిగింది. దూరాన స్వర్గం... పెరుగుతున్న కన్నబిడ్డను కూడా కనులార చూడ వ్యవధి లేదు. కాలం పరుగెత్తుతూనే వెళ్ళిపోయింది.

అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే రాజకీయ స్వార్థపరుల పద్మవ్యూహంలో చిక్కుకున్న మూర్ఖ ప్రజలు - అజ్ఞానులు - వివేకహీనులు - ఉద్రేకంలో కన్నుమిన్ను కానక ఫలితం యోచించక తమ జాతిని, తమ దేశాన్ని తామే నాశనం చేసుకునే దుర్ముహూర్తంలో పటాలం సాగిపోయింది.

శాంతిప్రియులు, అమాయక ప్రజలు నిత్యావసరాల కోసం అనుక్షణం శ్రమించవలసిన కష్టజీవులు- వారికర్థం కాని సమస్య అపాయం- అస్సాం నుంచి బెంగాలీ భాష అస్సాందేశంలో వాడరాదు.

బెంగాలీలు నశించాలి.

ఈ అంతర్యుద్ధంలో అంతులేని యీ మారణహోమంలో శాంతిని సుస్థిరం చేయగలిగింది మహాత్ముని శాంతి ప్రవచనాలు కావు- మారణ యుద్ధాలు, తుపాకీ గుళ్ళు.

కర్ఫ్యూలు - లాఠీ చార్జీలు.

ప్రజలకు, ప్రజానాయకులకు అర్థమయ్యే శాంతి అదొక్కటే!! దిగి వచ్చిన స్వర్గం అనిపించి - అప్సరల వలలో, మత్తెక్కించే అస్సాములోని తేయాకు తోటలు యుద్ధభూములయ్యాయి. శత్రువుల నుండి స్వజనాన్ని రక్షించవలసిన తుపాకులు స్వజనాన్నే హతమార్చాయి.

ఎన్నో యుగాలు జీవించవలసిన తాము, అప్పుడే ఎందుకు మరణించారు? అంతు తెలియని అల్పాయుష్కులు మా మధ్య కొనఊపిరితో ఉన్నవారికోసం వెదుకుతూ వుండే

అదే కంఠం! అదే స్వరం!!

"పానీ! పానీ" అని అరిచింది. ఉలిక్కిపడి అటు చూశాడు.

స్వర్గం అదే, వ్యథ అదే- కాని రూపం మాత్రం ఎవరిదో! తనకు తెలిసిన రూపం- ఎక్కడో హిమాలయ చరియల్లో వుంది.

మరణిస్తున్న వ్యక్తికి తాను మంచినీళ్ళు యివ్వలేదు. మెల్లిగా అడిగాడు "నీ పేరేమిటి?"

సమాధానమిచ్చిన అంతిమ శ్వాస చెప్పిన పేరు "చమేలి!"

రెక్కలు కట్టుకుని ఎక్కడో వాలుదా మనిపించింది.

ఉరుములు మెరుపులొచ్చాయి. ఎడతెగని వానవచ్చింది. బ్రహ్మపుత్ర పొంగిపోయింది. సంధి కుదిరింది.

రాజకీయవాదుల అంగబలం సంతృప్తి చెందింది.

భాషా సమస్య సమసిపోయింది.

నిన్నటి శత్రువులు యీనాటి మిత్రులై ఏనుగంబారీలు ఎక్కి జంట జంటగా ఊరేగింపులు జరిపారు.

ఈ అంగారక క్షేత్రంలో శాంతి నెలకొన్నదని జ్యోష్యులంతా అన్నారు.

పటాలం కదిలింది.

దేశంలో శాంతి సుస్థిరంగా వుంది.

ఎవరిదోవ వాళ్ళు వెళ్ళవచ్చునన్న ఆశా అపోహలగా మనసులో చిగురెత్తింది.

ప్రపంచానికి శాంతి కావాలి.

సుఖ సౌఖ్యంకూడా సామాన్య జనానికి కావాలి.

కాని....

ప్రపంచకాన్ని ఏలేది సామాన్య జనం కాదు.

అనుక్షణం సమస్యలను అలజడిని సృష్టించే రాజకీయవాదులు!

వారే యీ పృధ్వీ నాయకులు!

అశాంతి కాముకులు.

పటాలం మళ్ళీ కదిలింది.

బీహార్!

దేశ విభజనతో సమసిపోయిందనుకున్నా - మరచిపోయామనుకున్నా మారుమూల సమస్య.

హిందూ ముస్లిమ్ భాయి! భాయి! రక్షాబంధనం కట్టవలసిన చేతుల్లో బాకులున్నాయి.

ఎటు చూసినా - ఎటు విన్నా ఆర్త నినాదం, ఆక్రందనం.

నిన్నటిదాకా ప్రాణమిత్రులే.

శ్రమించుకొని బ్రతికిన కష్టజీవులే ఎందుకో అకారణ వైరం!

ఎవరు రగిల్చారు మీ హృదయాలలో యీ దావానలం?

సమాధానం రక్షణ కల్పించిన వారు యిచ్చిన సమాధానం-

"బెదిరింపులకు మేము లొంగిపోము. ఈ ఆకతాయితనాన్ని మేము ఎంత మాత్రం సహించం.

ఈ అలజడి, యీ విప్లవాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తాం."

ఈ భారత బృందంలో శాంతి స్థాపనకు ఒకే మార్గం- ఒకే మంత్రం.

శాంతి వచ్చింది. స్మశానమ్ మిగిలింది.

రాజ్యాలు పోయాయి. రాచరికాలు మారాయి.

కుజగ్రహం దక్షిణ దిక్కును చూసింది. ప్రపంచమంతా అటే చూసింది. ఎవరినోట విన్న ఒకటే మాట.

"తెలంగాణా!"

కారణం?

అన్నదమ్ముల మధ్య అరమరికలు ఏర్పడ్డాయి. పెద్దమనుష్యుల ఒప్పందంలో పెద్దరికాలు పోయాయి.

కక్షలు మిగిలాయి. కార్పణ్యాలు రేకెత్తాయి. కంచె చేను మేసిందన్నారు.

రాజకీయ నాయకులు.

విప్లవం?

సత్యాగ్రహం...

శాంతియుత పోరాటం...

హింసాయుక్త ప్రతిష్ఠంభన. తుపాకికి తుపాకి బదులు పలికింది.

ప్రజావాహిని కదిలింది.

గమ్యం మరిచిపోయింది. సాధన మారిపోయింది.

వ్రతమూ చెడింది. ఫలమూ దక్కలేదు.

ఊహలో నిలిచిన శత్రువుని చూడలేక- ఎదుట నిలిచిన మిత్రుని గుర్తించలేక-

అజ్ఞానం, ఆవేశం, అంధత్వం నాయకులై ముందుకు నడిపించగా ప్రజావాహిని కదిలింది.

తనని తాను నాశనం చేసుకోవడానికి కాని-

ప్రజాస్వామ్యంలో సుస్థిరం ప్రజలే- నాయకులు ప్రజలే- మిత్రులు ప్రజలే- శత్రువులు ప్రజలే-

యమునా తీరం నుంచి దక్షిణాదికి హుకుం వచ్చింది.

ఏమని?

శాంతి కావాలి!

భద్రత కావాలి!!

సౌఖ్యం కావాలి!!

ఈ సంగ్రామంలోకి రథసారథిగా వచ్చింది శ్రీకృష్ణపరమాత్ముడూ కాదు, అహింసా నాయకుని ఆత్మకాదు.

పటాలం - సైన్యం.

సరిహద్దును కాపాడవలసినవారు, శత్రువులని ఎదిరించవలసినవారు రణ సన్నద్ధులై వచ్చారు.

తమవారిని ఎదిరించడానికి-

శాంతి భద్రతలు నెలకొల్పడానికి.

సమయం తొమ్మిది గంటలు!?

వైర్‌లెస్ మ్రోగింది.

లారీలు వెనక్కు తీసుకొని వెళ్ళండి.

క్రమశిక్షణ అదికూడా కవాతులో ఒక భాగంగా దళం కదిలింది.

జనం కలవరం.

ఎవరో బిగ్గరగా కేకపెట్టారు. ఉన్మాదంతో కూడిన విజయోత్సాహం!

సి.ఆర్.పి. పారిపోతోంది. సి.ఆర్.పి. పారిపోతోంది. పెను తుఫాను లాగా ప్రజావెల్లువ సాగింది. తామింత వరకూ తవ్విన గోతి వరకూ వచ్చి ఆగింది.

సి.ఆర్.పి. వెనక్కు తగ్గిన మాట నిజమే. కాని ముందుకు వస్తున్నదేమో "మిలటరీ."

వెల్లువ ఒక్క క్షణం ఆగింది.

రేడియో సిలోనులో పాట మారింది.

'సమయం తొమ్మిదిగంటల అయిదు నిమిషాలు' అని మైక్ పలికింది. కెప్టెన్ రణధీర్ మాట్లాడుతున్నాడు. ప్రజలను హెచ్చరిస్తున్నాడు.

"ఈ నగర ప్రాంతాలలోను, పరిసరాలలోను, కర్ఫ్యూ సమయంలో ప్రజలు బయటకు రావడం గాని, గుమిగూడి ఉండటం కాని, విద్రోహక చర్యలు జరపడంగాని శాసనానికి విరుద్ధం. అది మహా అపరాధం.

ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిని కనబడిన వెంటనే కాల్చి పారవేయటానికి మాకు అధికారం వుంది. కలెక్టర్ పర్మిషన్ వుంది.

శాంతి వాంఛించే ప్రజలకు మరో హెచ్చరిక. ఇప్పుడు సమయం తొమ్మిది గంటల అయిదు నిమిషాలు. తొమ్మిది గంటల పదిహేడు నిమిషాలదాకా మీకు వ్యవధిని ఇస్తున్నాము. ఎవరి ఇళ్ళకు వాళ్ళను వెళ్ళిపొమ్మని, శాంతియుతంగా వుండవలసిందిగా హెచ్చరిస్తున్నాము!

ఎక్కడ చూచినా నిశ్శబ్దం....

ఇసుక వేస్తే రాలనంత జనం - పసికందులు - అమాయక బాలబాలికలు-

అసూర్యంపశ్యలు - శతవృద్ధులు ఏక కంఠంతో ఇచ్చిన సమాధానం...

'సి.ఆర్.పి. గో బాక్, మిలటరీ గో బాక్.'

కాలం గడుస్తూనే వుంది. గడియారం ముల్లు తిరుగుతూనే వుంది. శిలా ప్రతిమలకన్న నిశ్చలంగా వున్నారు మిలటరీ యోధులు- అగ్ని పర్వతం కన్నా ఉద్రేకంగా వున్నారు ప్రజలు.

సమయం తొమ్మిదిగంటల పదిహేను నిమిషాలు.

కలెక్టరుగారి కంఠం మైకులో పలికింది. "నా సోదర ప్రజలకు మనవి. ఇంకొక్క రెండు నిమిషాలలో వ్యవధి ముగుస్తుంది. అర్థంలేని ఆవేశాలకు లోనై

అమాయక ప్రజల్ని బదిలి చేయకండి. బలి కాకండి. శాంతియుతంగా ఎవరి యిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోండి. నేను వ్యక్తిగతంగా మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను.

ఈ ప్రార్థనకు ఫలితం- అమాయకుల గుండెలు కరగలేదు. ఆయన బోధలు చెవికి ఎక్కలేదు.

ఉద్రేకం యిచ్చిన సలహా, "ఈ సి.ఆర్.పీ లు, యీ మిలటరీలు మనల్నేం చెయ్యలేవు.

పదండి ముందుకు

పదండి ముందుకు

పదండి పోదాం పై పైకి"

అలలు కదిలినాయి. కెరటం ఉవ్వెత్తుగా లేచింది.

లారీలో కూర్చున్న సోహన్ సింగ్ ఉలిక్కిపడ్డాడు.

చేతిలో జెండా, చంకను పసిబిడ్డ ఎత్తుకుని ముందుగా నడచివస్తున్న ఆ వనిత ఎవరు?

తొమ్మిది గంటలు పదిహేడు నిమిషాలు.

మైకులో కెప్టెన్ రణధీర్ కంఠం- "ప్రజలకు ఆఖరి హెచ్చరిక వ్యవధి ఉంది. మీరు వెంటనే వెళ్ళకపోతే తుపాకులతో కాల్చవలసి వుంటుంది.

మళ్ళీ హెచ్చరిస్తున్నాను.

మా దగ్గర ఆటోమేటిక్ రైఫిల్స్ వున్నాయి.

మెషీన్‌గన్ వాడబోతున్నాం... నిమిషానికి అరవై తూటాలు,

ఆరువందల గజాల మేరకు దూసుకుపోగలవు.

హెచ్చరిస్తున్నాం వెళ్ళిపోండి!

ఈ సైరను ఆగిపోయే లోపల మీరీ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోవాలి."

వెనక్కి తిరిగి ఒక్కసారి చూశాడు సోహన్‌సింగ్.

సైరను మ్రోగుతోంది.

ఒక ప్రక్కన మిలటరీ ట్రక్కులు

ఒక ప్రక్కన సి.ఆర్.పి. వ్యాన్లు, వెనుక అంబులెన్సు మెడికల్ యూనిట్స్- కుడి ప్రక్కన జీపులో డి.ఎస్.పి. కలెక్టరు.

ఎటుచూసినా ప్రజాసమూహం.

సమయం తొమ్మిది గంటల యిరవై నిముషాలు.

కాలేజీ ఆడపిల్లలు, హైస్కూలు మొగపిల్లలు- మహిళా మండలి సభ్యులు పెను తుఫానులాగా సాగివస్తూ వుంటే పద్నాలుగు లోకాలకు మించిన కేక...

జై ఆంధ్ర!!!

కంటికి కనిపించిన దృశ్యం- రెపరెపలాడే వేలాది పచ్చని జెండాలు.

"అక్కడే ఆగండి! ముందుకు రాకండి! మీరు అడుగు ముందుకు వేస్తే మేము ఫైర్ చేస్తాం."

ప్రళయం ముందుకే సాగినాయి. మైక్ మళ్ళీ గర్జించిన పొజిషియన్.

మెషిన్ గన్‌లన్నీ పొజిషన్‌లోకి వచ్చాయి.

కురుక్షేత్రంలో వెయ్యి శంఖాలు మ్రోగాయి.

"కడసారి హెచ్చరిక! ముందుకు రాకండి వెళ్ళిపోండి."

అమాయకులు, అజ్ఞానులు ముందుకే నడిచారు.

పిడుగు పడ్డంత బిగ్గరగా వినిపించింది ఒకే మాట "ఫైర్!"

మెషిన్‌గన్ మ్రోగింది.

అంతకన్నా బిగ్గరగా వినిపించింది అమాయకుల హాహాకారాలు!

ఒకే ఒక్క రవుండు ఫైరింగ్ జరిగింది.

మరణించినవారు ఎందరో? గాయపడినవారు ఎందరో?

వారికి సాయపడినవారు ఎవ్వరూ లేదు.

సమయం-

తొమ్మిది గంటల ఇరవై రెండు నిమిషాలు.

సి.ఆర్.పి. వ్యాన్లు ముందుకు కదిలాయి.

సోహన్‌సింగ్ కంట పడందే వీరు

పసిపిల్లవాడిని ఎత్తుకుని పచ్చ జెండా పుచ్చుకొని జై ఆంధ్రా! అంటూ పరిగెత్తుకు వచ్చిన ముగ్ధ ఇంతవరకూ ఇక్కడే సజీవంగా వుంది.

ఇప్పుడు మాత్రం ఇక్కడలేదు. తల్లి లేదు, పసిపిల్లవాడు. హంసలు ఎప్పుడో ఎగిరిపోయాయి.

కొనవూపిరి అన్నా వుందేమోనని ఆశగా దగ్గరగా ముఖంలో ముఖంపెట్టి చూశాడు.

నిరాశే...

మనస్సు పేలిన అగ్నిపర్వతం 'చమీలీ' అంటూ పిలిచింది.

గుండుసూదులు నింపి, ఎం(డ్రీన్ కలిపిన సోడాబుడ్లు ఒక్కసారి వానలాగా కురిసాయి.

ఆటంబాంబుల్లాగా (పేలాయి.

రక్తసిక్తమై చిన్నాభిన్నమై అనంతంలోకి కలిసిపోతున్న సోహన్‌సింగు లీలగా, అస్పష్టంగా విన్నమాట

"సావన్ బీతా జాయ!

బలమా తూ నహి ఆయ!!"